ఈనాడు
కుమురం భీం
శనివారం అక్టోబరు 19, 2024

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు కళా ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. గానం, సంగీత వాయిద్యాలు, విజువల్ ఆర్ట్స్, సంప్రదాయ కథలు చెప్పడం, చిత్రలేఖనం, డ్రామా తదితర ఆరు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ ప్రశంసాపత్రాలను అందజేశారు.

జిల్లాస్థాయి విజేతలు వీరే..

గాత్ర గానం ప్రథమ స్థానంలో కె.వైశాలి(కేజీబీవీ, రెబ్బెన), ద్వితీయ స్థానంలో డి.నందిని(కేజీబీవీ, చింతలమానెపల్లి), సంగీత వాయిద్యాల్లో ప్రథమ స్థానంలో జోయల్(తెలంగాణ ఆదర్శ పాఠశాల, ఆసిఫాబాద్), ద్వితీయ స్థానంలో బి.క్షితజ్(ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్, కాగజ్‌నగర్), విజువల్ ఆర్ట్స్‌లో ప్రథమ స్థానంలో టి.అనూష(కేజీబీవీ, రెబ్బెన), ద్వితీయ స్థానంలో ఎన్.శ్రావ్య(కేజీబీవీ, పెంచికల్‌పేట్), సంప్రదాయ కథలు చెప్పడంలో ప్రథమ స్థానంలో ఎ.గంగన్న(జడ్పీ ఉన్నత పాఠశాల, రెబ్బెన), ద్వితీయ స్థానంలో కె.లాలస(కేజీబీవీ, రెబ్బెన), నృత్య ప్రదర్శనలో ఆర్.పౌర్ణిమ గ్రూప్(కేజీబీవీ, కౌటాల), ద్వితీయ స్థానంలో జి.శ్రావణి అండ్ గ్రూప్(కేజీబీవీ, రెబ్బెన), డ్రామా విభాగంలో ప్రథమ స్థానంలో జి.శ్రావణి(కేజీబీవీ, రెబ్బెన), ద్వితీయ స్థానంలో వైష్ణవి అండ్ గ్రూప్(కేజీబీవీ, రెబ్బెన)లు నిలిచారు. వీరు నవంబరు 1న రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న కళా ఉత్సవ్ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొననున్నట్లు చెప్పారు.


జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి వెంకటేష్ దోత్రే, చిత్రంలో అధికారులు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: వరి ధాన్యం కొనుగోళ్లకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా పాలనాధికారి వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వంజీరి రైతు వేదికలో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లతో కలిసి వివిధ శాఖల అధికారులతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. వరి ధాన్యం దిగుబడికి అనుగుణంగా వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నందున సన్నరకం, దొడ్డు ధాన్యాలకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. పంట పూర్తిగా ఎండిన తర్వాత కోతలు మొదలుపెట్టాలని సూచించారు. అవసరమైన గన్నీ సంచులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌రావు, డీఎస్పీ రామానుజం, మండల వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

నైపుణ్యమే అధనం..

● టాస్క్ శిక్షణతో ఉద్యోగావకాశాలు

చదువులో రాణించాలన్నా.. ఉద్యోగం సాధించాలన్నా నైపుణ్యం ఒడిసిపట్టాల్సిందే. విద్యార్థి జీవితంలో ఇంటర్ తర్వాత వేసే ప్రతి అడుగు అత్యంత కీలకం. ఈ దశలో రూపుదిద్దుకున్న తీరు ఉన్నతి వైపు నడిపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దేందుకు టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్) కృషి చేస్తోంది. అవకాశాలు కోల్పోతున్న యువతలో అత్యున్నత నైపుణ్య వికాసంపై శిక్షణ ఇస్తోంది. సాధారణ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా వివిధ రంగాల్లో రాణించేందుకు వారి భవితకు చేయూతనిస్తోంది.

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే


ఉద్యోగాలకు ఎంపికైన పలువురు విద్యార్థులు



యువతలో నైపుణ్యాలు పెంపొందించి ఉద్యోగ సాధనకు మార్గాన్ని సులువుగా చేయడమే లక్ష్యంగా టాస్క్ ముందుకు సాగుతోంది. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఫార్మసీ, ఎంబీఏ ఇతర విద్యను అభ్యసించే విద్యార్థులకు వివిధ అంశాల్లో తర్ఫీదు అందిస్తోంది. టాస్క్‌లో నమోదు చేసుకోవడం ద్వారా నైపుణ్య అంశాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు వివిధ సందర్భాల్లో సంస్థలు, పరిశ్రమల సహకారంతో నిర్వహించే ఉద్యోగ మేళాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. తెలంగాణ అకాడమీ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో గత ఏప్రిల్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో పలువురు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గత విద్యాసంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 45 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల నమోదు ప్రక్రియ చేపట్టగా 1400 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆయా కళాశాలల్లో టాస్క్ శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.


మంచిర్యాల సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో టాస్క్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

వివిధ అంశాలపై...

కళాశాల స్థాయిలో 40 నుంచి 50 మందిని బ్యాచ్‌లుగా విభజిస్తారు. ప్రతి విద్యార్థికి అర్థమెటిక్ అండ్ రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్, ఒక సాంకేతిక కోర్సు బోధిస్తారు. ప్రముఖ కార్పొరేట్, ఐటీ కంపెనీలకు క్షేత్ర స్థాయి పర్యటనలకు తీసుకెళ్తారు. సామర్థ్యాలను పరీక్షించి ప్రతిభ ఆధారంగా ధ్రువపత్రాలు అందిస్తారు. ఉద్యోగ నియామకాల సమయంలో టాస్క్ ధ్రువపత్రానికి ప్రాధాన్యమిస్తారు.

మెలకువలు నేర్పించారు



సాక్షి అగర్వాల్, మంచిర్యాల

డిగ్రీలో చేరగానే టాస్క్‌పై అధ్యాపకులు అవగాహన కల్పించడంతో ప్రవేశం పొందా. ఉద్యోగ నైపుణ్య మెలకువలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మేళాలో పాల్గొని ఇంటర్వ్యూని ధైర్యంగా ఎదుర్కొని స్థానిక పిరమల్ క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం సాధించా.

శిక్షణతో ఆత్మస్థైర్యం పెరిగింది



డి. లహరి, మంచిర్యాల

టాస్క్ శిక్షణలో ఉద్యోగానికి అవసరమైన మెలకువలు నేర్పించారు. సంస్థలు నిర్వహించే ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలు వివరించారు. వ్యక్తిత్వ వికాసం నైపుణ్యాలపై పట్టు సాధించా. డిగ్రీ పూర్తికాగానే ప్రాంగణ నియామకాల్లో ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగం లభించింది.

మంచి అవకాశం



బి.దీపరెడ్డి ఉమ్మడి జిల్లా టాస్క్ రిలేషన్‌షిప్ మేనేజర్

టాస్క్ ద్వారా వివిధ కోర్సుల్లో అవగాహన కల్పిస్తూనే ఉపాధి పొందేందుకు సాయం అందిస్తున్నాం. ముందే రూపొందించుకున్న కార్యాచరణను పక్కాగా అమలు చేస్తున్నాం. అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ పలు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం. ప్రస్తుత సంవత్సరం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది.

45	ఉమ్మడి జిల్లాలో టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న కళాశాలలు మొత్తం	డిగ్రీ కళాశాలలు	35	పాలిటెక్నిక్	6	పీజీ	3	ఇంజినీరింగ్	1	1150	గతేడాది నమోదు చేసుకున్న విద్యార్థులు	256	ఉద్యోగాలకు ఎంపికైనవారు


దహెగాం మండలంలో చీకట్లో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

దహెగాం మండలం గిరవెల్లి పంచాయతీ, ఈటెపల్లి గ్రామాల్లో వారం రోజులుగా సక్రమంగా విద్యుత్తు సరఫరా లేక అంధకారం నెలకొంది. గృహ వినియోగం, వ్యవసాయ కనెక్షన్లకు తగ్గట్టు సామర్థ్యం కలిగిన నియంత్రికలు ఏర్పాటు చేయకపోవడంతో అవి కాలిపోతున్నాయి. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతుంది.



బెజ్జూరు మండలం ఎల్కపల్లికి వెళ్లే మార్గంలో వేలాడుతున్న విద్యుత్తు తీగలు ఇవి. గాలులు వీచిన సందర్భాల్లో తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. విద్యుత్తు తీగలకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని బాధిత గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గాలులు వీచిన సమయాల్లో తీగలు ఒకదానికొకటి తాకి కాలిపోతున్నాయి.

నిర్లక్ష్యం.. విద్యుత్తు కష్టాలే సాక్ష్యం

◆ చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్‌లోని 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రం ఉంది. దీనికి 5 కిలోమీటర్ల దూరంలోని గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉండకూడదు. కానీ రవీంద్రనగర్‌లో విద్యుత్తు సరఫరా ఎప్పుడు ఉంటుందో తెలియని పరిస్థితి.

◆ కాగజ్‌నగర్ మండలంలోని గంగన్నగూడలో 100 కేవీ విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేశారు. 10 నుంచి 12 వరకు వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వడానికి ఈ నియంత్రిక సామర్థ్యం కలిగి ఉంటుంది. గతంలో 35 మంది రైతులకు కనెక్షన్లు ఇవ్వగా ఇటీవల మరో ముగ్గురు రైతులకు కనెక్షన్లు ఇచ్చారు. సరిపడా సామర్థ్యం కలిగిన నియంత్రిక ఏర్పాటు చేయనున్నట్టు ఏడాది కిందటే అధికారులు తెలిపినా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే

జిల్లాలో పలు మండలాల్లో వేలాడుతున్న విద్యుత్తు తీగలతోపాటు వ్యవసాయ, గృహ వినియోగ కనెక్షన్ల సంఖ్యకు తగ్గట్టు సామర్థ్యం కలిగిన విద్యుత్తు నియంత్రికలు ఏర్పాటు చేయడం లేదు. విద్యుత్తు లైన్ల నిర్వహణకు నిధులు మంజూరు అవుతున్నప్పటికీ మరమ్మతులు చేపట్టడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల వ్యవసాయ కనెక్షన్లు కలిగిన విద్యుత్తు లైన్లకు గృహవినియోగ కనెక్షన్లు ఇచ్చారు. విద్యుత్తు నియంత్రికలకు లోడ్ భారం పడుతున్నందున గృహాల్లో టీవీలు, మీటర్లు కాలిపోయిన ఘటనలు ఉన్నాయి. కొన్ని చోట్ల గృహ వినియోగదారులు తమ సొంత ఖర్చులతో కర్ర స్తంభాలు వేసుకొని కనెక్షన్లు పొందారు. వినియోగదారుల అవసరం రీత్యా కనెక్షన్లు ఇచ్చిన అధికారులు ఏళ్లు గడిచినా సిమెంట్ స్తంభాలు వేయడం లేదు.

జిల్లా వివరాలు ఇలా..

- డివిజన్లు(కాగజ్‌నగర్, ఆసిఫాబాద్): 02
- 132/33 కేవీ ఉపకేంద్రాలు (ఆసిఫాబాద్, ఈజ్‌గాం): 02
- విద్యుత్తు కనెక్షన్లు: 1,13,192
- వ్యవసాయ " : 6,645
- వీధిదీపాలు, నీటి సరఫరా " : 2,016
- ఆలయాలు, మసీదులకు " : 1,123
- విద్యుత్తు వినియోగం రోజువారీగా: 20 మెగావాట్లు
- విద్యుత్తు ఉప కేంద్రాలు: 34

సామర్థ్యం ప్రకారం ..

వ్యవసాయ నియంత్రిక సామర్థ్యాన్ని బట్టి కనెక్షన్లు ఇవ్వాలి. అధికారులు ఇష్టారాజ్యంగా ఇస్తున్నారు. ఫలితంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఇన్‌ఛార్జి ఏడీఈ శ్రీనివాస్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

అందుబాటులోకి ఔషధ కేంద్రం

● వైద్య కళాశాల ఆవరణలో ఏర్పాటు

జిల్లాలో 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అయిదు సామాజిక ఆసుపత్రులు, రెండు ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాల ఉంది. ఇది వరకు వీటికి ఔషధాలు అవసరం అయినప్పుడు ఉమ్మడి జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచే వచ్చేవి. ఉదాహరణకు బెజ్జూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆదిలాబాద్ నుంచి మందులు రావాలంటే 220 కి.మీ. దూరం ప్రయాణించాలి. కానీ జిల్లా కేంద్రంలోని సీడీఎస్ ఏర్పాటు కావడంతో 130 కి.మీ. దూరభారం తగ్గింది. అత్యవసరమున్న వారు నేరుగా ఈ కేంద్రానికి వచ్చి మందులు తీసుకెళ్లవచ్చు. ఈ కేంద్రం నిర్వహణ తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ఈ కేంద్రంలో ఇంకా ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు ప్యాకర్లు, మందుల సరఫరాకు ఒక వాహనం కావాల్సి ఉంది. త్వరలో ఇవి సమకూరనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.



వైద్య కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సెంట్రల్ డ్రగ్ స్టోర్



ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఇక ఔషధాల కొరత తప్పనుంది. ప్రతీ జిల్లాలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అందులో భాగంగా జిల్లాకు ఈ కేంద్రాన్ని మంజూరు చేసింది. దీంతో మండలంలోని అంకుసాపూర్‌లోని వైద్య కళాశాల ఆవరణలో నాలుగు గదులను కేటాయించారు. తాత్కాలికంగా ఇక్కడ ఔషధాల నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం శాంపిల్‌గా 45 రకాల మందులను అందుబాటులో ఉంచారు. ఇద్దరు ఫార్మాసిస్టులను కేటాయించారు. త్వరలో పూర్తి స్థాయిలో మందుల నిల్వలు వస్తాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ఇది వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఉండేది. అక్కడి నుంచే అన్ని జిల్లాలకు అవసరమైన మందులను సరఫరా చేసేవారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలకు అవసరమైన మందుల కోసం సంబంధిత ఫార్మాసిస్టులు ఈ-ఔషధి వెబ్‌సైట్‌లో ఇండెంట్ పంపేవారు. దాని ప్రకారం ప్రత్యేక వాహనంలో సీడీఎస్ నిర్వాహకులు మందులు సరఫరా చేసేవారు. ఒకే వాహనం ఉండటంతో అది అన్ని జిల్లాల్లోని మండలాలకు వెళ్లాలంటే సమయం పట్టేది. ఒక్కోసారి మారుమూల మండలాలకు ఇండెంట్ పంపిన 15 రోజులు, నెల రోజులకు మందులు వచ్చేవి. మరో వైపు ఆ జిల్లాలో అవసరమైన మందులను మొదట ప్రాధాన్యంగా తీసుకొని మిగతా జిల్లాలకు పంపించేవారు. కొన్ని సందర్భాల్లో తక్కువ మందులు రావడం, విలువైన మందులు అందకుండా పోయేది. దీంతో స్థానికంగా రోగులు కొనుగోలు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం జిల్లా జనరల్ ఆసుపత్రిలో 21 రకాల ఔషధాలు లేక రోగులు బయట కొనుగోలు చేస్తున్నారు. ఔషధ నిలువ కేంద్రం ఏర్పాటు కావడంతో త్వరలో అన్ని రకాల మందులు అందుబాటులోకి వస్తాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

నేరుగా కంపెనీల నుంచి..

సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఏర్పాటు కావడంతో అవసరమైన మందులను కేంద్రం నిర్వాహకులు నేరుగా సంబంధిత కంపెనీలకే ఇండెంట్ పంపిస్తారు. దీంతో ఏ మందులు కావాలన్నా వచ్చే అవకాశం ఉంటుంది. కోతలు లేకుండా కోరిన మేరకు ఔషధాలు వస్తాయి. వైద్య కళాశల ఏర్పాటు కావడంతో ఖరీదైన ఔషధాలు సైతం అందుబాటులోకి రానున్నాయి. ఇంకా ఈ-ఔషధి సైట్‌లో నమోదు కాకపోవడంతో ప్రస్తుతం మ్యానువల్‌గా మందులను సరఫరా చేస్తున్నారు.

రాష్ట్రస్థాయిలో జిల్లా విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రాలతో జిల్లా విద్యార్థులు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్‌లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటి మూడో స్థానంలో నిలిచారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఈ విద్యార్థులు కృత్రిమ మేధా-సమాజం అనే అంశంపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన బృందాలు పాల్గొనగా జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రదర్శనతో మూడో స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఉదయ్ బాబు, జిల్లా సైన్సు అధికారి కటకం మధుకర్ పేర్కొన్నారు. విద్యార్థులు డైరెక్టర్ రమేశ్, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి తీర్చిదిద్దిన పాఠశాల ఉపాధ్యాయులు, గైడ్ టీచర్లను అభినందించారు.

గ్రూప్-2,3 పరీక్షల ఏర్పాట్ల పరిశీలన


సెయింట్ క్లారెట్ పాఠశాలలో ఏర్పాట్లపై నిర్వాహకులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : జిల్లాలో నిర్వహించనున్న గ్రూప్-2, 3 పరీక్షల ఏర్పాట్లను శుక్రవారం కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్ల పరిశీలించారు. పట్టణంలోని వసుంధర డిగ్రీ కళాశాల, సెయింట్ క్లారెట్ పాఠశాల, వివేకానంద డిగ్రీ కళాశాల, ఫాతిమా కాన్వెంట్, సుప్రభాత్ పాఠశాల, జవహర్ నవోదయలో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఆయా కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, విద్యుత్తు సరఫరా, ర్యాంపు, ఫ్యాన్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. కాగజ్‌నగర్ తహసీల్దార్ కిరణ్ ఉన్నారు.

పాడికి ప్రోత్సాహకం.. లక్ష్యం దూరం

● ఉమ్మడి జిల్లాలో మూడు పాల శీతలీకరణ కేంద్రాల పరిస్థితి



న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం

పాడి రైతును ప్రోత్సహించేలా వారి నుంచి మద్దతు ధరకు పాలు కొనుగోలు చేసి విక్రయించేందుకు ప్రభుత్వం పాల శీతలీకరణ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతన్నల కోసం ఆదిలాబాద్ పట్టణంలో తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య కార్యాలయాన్ని ఏర్పాటుచేసి ఇక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తోంది. కొనుగోలు చేసిన పాలను ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ వసతిగృహాలు, కస్తూర్బాలు, గురుకులాలకు ప్యాకెట్ల రూపంలో సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 2021లో మూడుచోట్ల రూ.18 కోట్లతో అందుబాటులోకి తెచ్చిన ఈ కేంద్రాల్లో పరికరాలు భారీ వ్యయంతో ఏర్పాటు చేసినా డిమాండ్‌కు తగ్గ పాలు సరఫరా కావడం లేదు. గతంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదిలాబాద్‌లోని ఈ పాల కేంద్రంలో 2 వేల లీటర్ల కంటే ఎక్కువ పాలు కొనుగోలు చేసేవారు కాదు. ప్రస్తుతం ఉన్న అధికారుల చొరవతో ఇది మూడింతలు దాటింది. కానీ ఈ కేంద్ర సామర్థ్యానికి ఉన్న లక్ష్యం ఎప్పటికీ నెరవేరదనడంలో సందేహం లేదు.

◆ మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో రూ.6 కోట్లతో 20 వేల లీటర్ల పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడ 6 వేల నుంచి 7 వేల లీటర్ల కంటే ఎక్కువ పాలు రావడం లేదు. ఫలితంగా 10 వేల లీటర్ల సామర్థ్యంలో ఉన్న స్టోరేజీ ట్యాంకులు రెండు నిరుపయోగంగా ఉంటున్నాయి.

◆ నిర్మల్ జిల్లా సోఫీనగర్‌లో రూ.3 కోట్లతో 10 వేల లీటర్ల సామర్థ్యంతో 2021లోనే పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడ పరికరాలు, స్టోరేజీ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. పరికరాలు అధ్వానంగా ఉండడంతో ఈ కేంద్రాన్ని మూసివేశారు. రైతుల కోసం అక్కడే రూ.50 లక్షల వ్యయంతో కొత్తగా కేంద్రాన్ని ఏర్పాటు చేసి నెట్టుకొస్తున్నారు.

ఈ మూడు కేంద్రాల కోసం రూ.14.60 కోట్లు, ఇతర ఖర్చులకు మరో రూ.3.40 కోట్లు.. మొత్తం కలిపి రూ.18 కోట్లు వెచ్చించారు. కానీ ప్రయోజనం అంతంతమాత్రమే.



ఆదిలాబాద్ పట్టణం గాంధీ పార్కు పక్కన పాల శీతలీకరణ కేంద్రంలో మూడేళ్లుగా ఉపయోగంలోకి రాని స్టోరేజ్ ట్యాంకులివి. ఒక్కో ట్యాంకు సామర్థ్యం 10 వేల లీటర్లు. రెండు ట్యాంకులు కలిపి 20 వేల లీటర్ల వరకు పాలు నిల్వ చేయొచ్చు. ఇదే కేంద్రంలో 5 వేల లీటర్ల ట్యాంకు మరో రెండు, చిన్న ట్యాంకులు మరో మూడు ఉన్నాయి. మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. ఇక్కడ మొదటి నుంచి రైతులు పాలు విక్రయించేందుకు అంతగా రావడం లేదు. కానీ రూ.5.60 కోట్లతో 20 వేల లీటర్లకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన యూనిట్‌ను ఏర్పాటు చేశారు. అధికారులు కష్టపడి ప్రస్తుతం 7 వేల నుంచి 8 వేల లీటర్ల వరకు రోజూ కొనుగోలు చేస్తున్నారు.

విక్రయాలు పెరిగాయి..

- మధుసూదన్, డెయిరీ డిప్యూటీ డైరెక్టర్

రైతులకు పాలలో వెన్న ఆధారంగా చెల్లింపులు చేస్తున్నాం. ప్రస్తుతం సరాసరి లీటరుకు రూ.55 నుంచి రూ.60 వరకు అందిస్తున్నాం. 50 శాతం రాయితీపై పశు దాణా, పశువులలో పాల ఉత్పత్తి పెంచేందుకు 32 రకాల లవణాలు ఉండే మినరల్ మిక్చర్ తక్కువ ధరకు ఇస్తున్నాం. గడ్డి విత్తనాలు తక్కువ ధరకే అందిస్తున్నాం. ప్రోత్సాహకాలు అందించడంతో గతంలో కంటే పాల విక్రయాలు పెరిగాయి.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు ట్రాన్స్‌కో టౌన్ ఏఈ కమలాకర్ తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

విదేశీ విద్యానిధి పథకం దరఖాస్తుల గడువు పొడిగింపు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద విదేశాల్లో ఉన్నత చదువులకు అందించే ఆర్థికసాయానికి దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించారని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కులాల విద్యార్థులు ఉన్నత చదువులకు ఆర్థికసాయం కోసం ఈ నెల 29లోపు అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అభిరుచి.. ఆచరించి



ప్రపంచంలో ఎత్తయిన లెటర్ బాక్సు వద్ద ప్రణయ్‌కుమార్

జిల్లా కేంద్రానికి చెందిన బి.ప్రణయ్‌కుమార్ ఫొటోగ్రఫీ వృత్తిలో కొనసాగుతున్నారు. ఆయనకు ద్విచక్ర వాహనంపైన సాహసోపేత ప్రయాణం చేయడం అభిరుచి. ఇప్పటికే ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ప్రదేశాలు లద్దాఖ్‌లోని ఉమ్లింగ్లా, ఖార్దుంగ్‌లా పర్వత ప్రాంతాలను సందర్శించారు. ఈ నెల 11న ఆదిలాబాద్ నుంచి బయలుదేరిన ఆయన తాజాగా హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం స్పితి జిల్లాలోని హిక్కిం గ్రామాన్ని 16న చేరుకున్నారు. అక్కడ ప్రపంచంలోనే ఎత్తులో ఉన్న తపాలాశాఖకు చెందిన లెటర్ బాక్సు(సముద్ర మట్టం నుంచి 14,400 అడుగుల ఎత్తు), ఇదే జిల్లాలోని కాజా వద్ద ప్రపంచంలోనే ఎత్తులో ఉన్న పెట్రోల్ పంపును(సముద్ర మట్టం నుంచి 12,270 అడుగుల ఎత్తు) దర్శించుకున్నారు. ఈ క్రమంలో 2,567 కి.మీ.లు బైక్‌పైన ప్రయాణించానని, మరో అయిదు రోజుల్లో ఆదిలాబాద్ చేరుకుంటానని ఆయన 'న్యూస్‌టుడే'కు ఫోన్‌లో వివరించారు.

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం

ఈ పత్రాలే ఆధారం.. ప్రయోజనాలు అపారం

న్యూస్‌టుడే, చెన్నూరు గ్రామీణం : మనకు తోడుగా కుటుంబసభ్యులు, బంధుమిత్రులు ఉంటారు. వారికి మించి మన వెంట ఉండాల్సినవి ధ్రువీకరణ పత్రాలు. మనిషి పుట్టుక నుంచి మొదలుకొని మరణం వరకు వీటి అవసరం వెలకట్టలేనిది. దైనందిన అవసరాల్లో జీవితాంతం బాసటగా నిలిచే వీటిని పొందడంలో ఏమాత్రం అలసత్వం చేయకూడదు.



ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు చెన్నూరులోని మీసేవలో దరఖాస్తు సమర్పిస్తున్న తల్లిదండ్రులు

ఆధార్

ప్రస్తుత పరిస్థితుల్లో ఆధార్‌కార్డు లేకుండా ఏ పని జరగదు. బ్యాంకు ఖాతా తెరవాలన్నా.. సిమ్‌కార్డు పొందాలన్నా ఇది తప్పనిసరి. ప్రభుత్వ పథకాలను పొందాలంటే ఆధార్ ఉండాల్సిందే.

పొందే విధానం: పిల్లలకు ఆధార్‌కార్డు తీసుకోవాలంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. ఆధార్ జారీ చేసే కేంద్రాలకు వెళ్లి జనన ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత దరఖాస్తు ఫారాన్ని ఇవ్వాలి. నిర్వాహకులు పిల్లల ఫొటో, ఇతర వివరాలను తీసుకొంటారు. వారం, పదిరోజుల్లో ఆధార్‌కార్డు పొందవచ్చు.



పాన్‌కార్డు



పాన్‌కార్డు లేకుండా ప్రస్తుతం ఏ బ్యాంకూ రుణం ఇవ్వడం లేదు. ఆదాయ పన్ను చెల్లింపులో ఇది ఎంతో కీలకం. గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుంది. మన ఖాతాలు, రుణాలు, ఆర్థిక పరిస్థితులు దీని ద్వారా తెలుస్తాయి.

- ఆధార్‌కార్డు, రెండు పాస్ ఫొటోలతో ఆన్‌లైన్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే పక్షం రోజుల్లో తపాలాశాఖ ద్వారా పాన్ కార్డు వస్తుంది. పాన్‌కార్డు పోతే ఆధార్ కార్డు ద్వారా తిరిగి పొందే అవకాశం ఉంటుంది.

ఓటరు గుర్తింపు పత్రం



భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పిస్తోంది. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఇది అవసరం.

దరఖాస్తు ఇలా : వయసును నిర్ధారించే ఏదైనా ధ్రువీకరణ పత్రంతో ఒక పాస్‌ఫొటో, ఫారం-6ని పూర్తిచేసి ఆన్‌లైన్ కేంద్రాలతో పాటు చరవాణిలోని ఓటర్‌యాప్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మరణ ధ్రువీకరణ..



ఒక వ్యక్తికి సంబంధించిన ఆస్తి, ఆర్థిక, బీమా, తదితర ప్రయోజనాలను ఆ కుటుంబసభ్యులు పొందాలంటే మరణ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. గ్రామాల్లో అయితే పంచాయతీ కార్యదర్శి, పట్టణాలు, నగరాల్లో పురపాలికలు, కార్పొరేషన్ల ద్వారా తీసుకోవచ్చు.

- మరణించిన వ్యక్తి ఆధార్‌కార్డు, అతని పాస్‌ఫొటో, ఒక ప్రభుత్వ ఉద్యోగి ష్యూరిటీ తీసుకోవాలి. దరఖాస్తు చేసే కుటుంబసభ్యుడి ఆధార్‌కార్డుతో మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేస్తే విచారణ అనంతరం జారీ చేస్తారు.

డ్రైవింగ్ లైసెన్స్



ఇది లేకుండా వాహనాలు నడపొద్దు. తోడుగా లేకపోతే వాహనాల తనిఖీల సందర్భంగా జరిమానా విధిస్తారు. ప్రమాదాలు జరిగినపుడు ఎలాంటి బీమా వర్తించదు.

- వయసు నిర్ధారణ పత్రంతో పాటు ఆధార్‌కార్డు, చరవాణి నంబరుతో సంబంధిత ఫారాన్ని నింపి ఆన్‌లైన్‌లోనే రుసుం చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న తేదీన రవాణా శాఖ అధికారి(ఆర్టీవో) కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. కార్యాలయంలో ఫొటో తీసుకున్న తర్వాత మొదట లెర్నింగ్ లైసెన్స్ ఇస్తారు. నెల నుంచి ఆరునెలల లోపు తిరిగి స్లాట్‌బుక్ చేసుకొని రవాణా శాఖ అధికారి (ఆర్టీవో) కార్యాలయానికి వెళ్తే పరీక్ష నిర్వహిస్తారు. అందులో ఉత్తీర్ణత సాధిస్తే డ్రైవింగ్ లైసెన్స్ జారీ అవుతుంది.

పేరు తప్పు రాకుండా చేసుకోవాలి

మీ దగ్గర అన్ని కార్డులు ఉండొచ్చు, కానీ వాటిల్లో ఏమాత్రం పేరు తప్పు దొర్లినా ఆ కార్డు నిరుపయోగమే అవుతుంది. అన్నికార్డుల్లో, బ్యాంకు ఖాతాల్లో పేర్లు ఒకే రకంగా ఉండాలి. జనన ధ్రువీకరణపత్రం లేదా పదోతరగతి మెమోలో ఉన్న పేరులో ఏవైతే అక్షరాలు ఉన్నాయో అవే ఉండేలా చూసుకోవాలి.

జనన ధ్రువీకరణ ఇలా..

శిశువు పుట్టిన తర్వాత వారి పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలి. ఇది వయసును నిర్ధారించే ధ్రువీకరణ పత్రం. పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించాలంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి.

- ఆసుపత్రుల్లో జన్మించిన పిల్లల వివరాలను ఆసుపత్రి నిర్వాహకులే స్థానిక సంస్థల కార్యాలయాలకు అందజేస్తారు. తల్లిదండ్రులకు సైతం శిశువు జన్మించిన పత్రం అందజేస్తారు. దీంతో స్థానిక సంస్థల రిజిస్టర్‌లో నమోదైన సంఖ్యను తీసుకొని సంబంధిత ఫారాన్ని పూర్తిచేయాలి. తల్లిదండ్రుల పేర్లు, శిశువుకు పెట్టిన పేరును రాసి మీసేవలో దరఖాస్తు చేస్తే నాలుగైదు రోజుల తర్వాత జనన ధ్రువీకరణపత్రం అందుతుంది.



దండారీ ఉత్సవాలకు సన్నద్ధం..



నెమలి ఈకల టోపీని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్న యువకులు

దీపావళి పండగ సమీపిస్తుందంటే ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో సందడి మొదలవుతుంది. ఆదివాసీలు ఎంతో పవిత్రంగా భావించే ఈ పండగ సందర్భంగా తండాల్లో దండారీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడమే కారణం. పండగకు మూడు రోజుల ముందే భోగీ నిర్వహించిన తర్వాత ఆదివాసీ వాయిద్యాలైన డోల్, డోల్కీ, వెట్టె, తబలా, సూర్నా, డప్పులు, నెమలి ఈకలకు ప్రత్యేక పూజలు చేస్తారు. పండగ రోజు ఏత్మసూర్ పేన్ (శివుడు-విష్ణు-బ్రహ్మ), ఇతర దేవతల వేషాలతో గుస్సాడీలుగా అలంకరించుకుని ఆక్డా దేవతకు పూజలు చేసి గుస్సాడీ దండారీ వేడుకలు నిర్వహిస్తారు. నెమలి ఈకలతో టోపీ తయారు చేసి ఉత్సవాల్లో నృత్యాలు చేయడం ఇక్కడి ప్రత్యేకత. ఈక్రమంలో పక్షం రోజుల ముందు నుంచే నెమలి ఈకలను సేకరించి టోపీలు తయారు చేయడంలో పెద్దలు నిమగ్నమవుతుంటారు.

- న్యూస్‌టుడే, నార్నూర్

సృజనాత్మకత చాటి.. జాతీయస్థాయిలో మెరిసి



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: చదివేది తొమ్మిదో తరగతే అయినా.. తనలోని ప్రతిభతో జాతీయస్థాయి పోటీల్లో రాణించింది. తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచింది. ఫెయిర్‌గేజ్ ద్వారా ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన పోటీల్లో ఆమె నగదు బహుమతికి ఎంపికవడం విశేషం. వివరాలిలా ఉన్నాయి. స్థానిక వేదం గ్లోబల్ పాఠశాలకు చెందిన చిన్నోళ్ల ప్రశస్తిని ఇండియా యాజ్ ఐ సీ-2024 పోటీలో భాగంగా 'పవిత్ర స్వేచ్ఛ' అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో ఉత్తమంగా నిలిచింది. సృజనాత్మకతను చాటుతూ ఆమె రాసిన వ్యాసం మూడోస్థానం దక్కించుకుంది. ఈ మేరకు నిర్వాహకులు రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థ ఇండియా ఈజ్ అస్ భాగస్వామ్యంతో జరిగిన ఈ పోటీ విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు, నాటి పోరాటయోధుల జీవిత విశేషాలను తెలియజేయడానికి, స్వేచ్ఛ-స్వాతంత్ర్యం విలువ చాటిచెప్పడమే లక్ష్యంగా సాగింది. దేశవ్యాప్తంగా వందలాది మంది పోటీపడిన కాంపిటీషన్‌లో నిర్మల్ జిల్లా విద్యార్థిని తృతీయస్థానంలో నిలవడంపై కలెక్టర్ అభిలాష అభినవ్ అభినందించారు. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన విద్యార్థినితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ భూపాల్, ఉపాధ్యాయురాలు ప్రవళిక పాల్గొన్నారు.

నూతన కోర్సుల ఏర్పాటుకు కృషి



భోజనశాలలో భోజనం చేస్తున్న ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర ఆర్జీయూకేటీలో సాంకేతిక విద్యతోపాటు నూతన కోర్సుల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్ చెప్పారు. తొలిసారి విశ్వవిద్యాలయానికి వచ్చిన ఆయనకు పరిపాలన విభాగం అధికారి రణధీర్, ఆయా విభాగాల అధ్యాపకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయా విభాగాల అధ్యాపకులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆర్జీయూకేటీ పరిస్థితి, విద్యార్థుల వివరాలు, విభాగాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎవరికీ చెప్పకుండా నేరుగా భోజనశాలకు వెళ్లి భోజనం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం వంటగది, సరకులను పరిశీలించారు. వంటగది అపరిశుభ్రంగా ఉండటంతో శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఆయా విభాగాలకు వెళ్లి అధ్యాపకులతో మాట్లాడారు. వారి సమస్యలను స్వయంగా చూశారు. ఇక్కడ పనిచేసి బయటకు వెళ్లిన అధ్యాపకులు, సిబ్బందికి ఇచ్చిన గదులను వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.

ఆర్జీయూకేటీని అగ్రగామిగా తీర్చిదిద్దుతా

'న్యూస్‌టుడే'తో ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్

ముఖాముఖి



ముథోల్(బాసర), న్యూస్‌టుడే:

విద్యార్థుల అసౌకర్యాలను, విద్యాపరంగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ ఆర్జీయూకేటీని అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్ చెప్పారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శుక్రవారం బాసర ఆర్జీయూకేటీకి వచ్చారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆయా విభాగాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాలపై 'న్యూస్‌టుడే' ఉపకులపతితో ముఖాముఖి నిర్వహించింది.

? విశ్వవిద్యాలయంలో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటి పరిష్కారానికి ఏం చర్యలు చేపట్టబోతున్నారు?

ఇక్కడ సమస్యలను పరిష్కరించడానికి నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించారు. తొలుత విద్యార్థుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తాను. మిగతా వాటిని దశల వారీగా తీర్చడానికి కృషి చేస్తా. అయితే ఇందుకు కొంత సమయం పడుతుంది. విశ్వవిద్యాలయాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి శాయశక్తులా పాటుపడుతాను.

? విద్యార్థుల ఉద్యమం ఫలితంగానే మీ నియామకం జరిగిందనే దానిపై మీ స్పందనేమిటి?

ఇక్కడి సమస్యలను తీర్చే బాధ్యతలు నాకు అప్పగించారు. నమ్మకంతో పనిచేస్తాను. ఆకస్మిక తనిఖీలు చేపడుతాను. తప్పిదాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాను. ఇక్కడికి రాగానే నేరుగా భోజనశాలకు వెళ్లి విద్యార్థులతో కలిసి భోజనం చేశాను. పరిస్థితులు గమనించాను. అన్ని విభాగాలను పరిశీలించి సలహాలు, సూచనలను అందజేస్తాను. ఏ సమస్య ఉన్నా విద్యార్థులు నన్ను నేరుగా కలవొచ్చు. లేదంటే చరవాణిలో చెప్పొచ్చు.

? నాలుగేళ్లుగా ఏకరూప దుస్తులు, ల్యాప్‌టాప్‌లు, బూట్లు అందజేయడం లేదు.

ఇది ఆర్థికపరమైన సమస్య. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది.

? విద్యార్థి సంఘం కార్యవర్గానికి ఆమోదం తెలపడం లేదని గతంలో ఆందోళన చేశారు. దీనిపై మీ వైఖరి ఏమిటి?

నేను విద్యార్థుల మధ్యనే ఉంటాను. వారికే సమస్య వచ్చినా అండగా ఉండి పరిష్కరిస్తాను. సంఘం విషయంలో విద్యార్థులను పిలిచి మాట్లాడతాను.

? ఉపకులపతులు హైదరాబాద్ నుంచి పర్యవేక్షణ చేస్తారనే విమర్శలు ఉన్నాయి..?

నేను ఎక్కువ సమయం బాసరలోనే ఉంటాను. విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి సమయం కేటాయిస్తాను. వారి ఇక్కట్లను గమనించి తీర్చే యత్నం చేస్తాను. నేను కూడా వసతి గృహాల్లోనే ఉండి చదువుకొని ఉన్నతోద్యోగం చేస్తున్నాను. సమస్యలపై అవగాహన ఉంది.

? ఆరువేల మంది విద్యార్థినులకు ఆరుగురే కేర్‌టేకర్లు ఉన్నారు. వీరి సంఖ్య పెంచుతామని చెప్పినా ఆచరణలోకి రాలేదు?

ఈ సమస్య నా దృష్టికి వచ్చింది. దీనిపై సమీక్ష సమావేశంలో చర్చిస్తాం. ఏ విధంగా నియామకాలు చేపట్టాలన్న దానిపై ప్రభుత్వానికి నివేదిక అందజేసి సాధ్యమైనంత త్వరగా చర్యలు చేపడతాం.

? అందరూ తాత్కాలిక అధ్యాపకులే.. అందులోనూ సగానికి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భర్తీకి ఏం చేస్తారు?

బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీల వివరాలు సేకరించాను. వాటిపై ఉన్నతాధికారులతో మాట్లాడతాను. సాధ్యమైనంత త్వరగా ముఖ్యమైన పోస్టుల భర్తీకి ప్రయత్నాలు చేస్తాను.

నలుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు

- 900 కిలోల గంజాయి కేసులో సూత్రధారులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద గత నెలలో రూ.2.25 కోట్ల విలువైన 900 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. అప్పుడు 8 మందిపై కేసు నమోదు చేశారు. ఐచర్ కంటైనర్ డ్రైవర్ వసీం, క్లీనర్ అర్మాన్‌లను అదే రోజు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలో వారిని శుక్రవారం అరెస్టు చేశారు. గ్రామీణ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. సెప్టెంబరు 20న ఆంధ్రా - ఒడిశా సరిహద్దు నుంచి మహారాష్ట్రకు ఐచర్ వాహనంలో గంజాయిని ఆదిలాబాద్ మీదుగా తరలిస్తున్నారు. ఐచర్ వాహనంలో డ్రైవర్ వసీం, క్లీనర్ అర్మాన్ ఉన్నారు. వీరికి ఎస్కార్ట్‌గా వ్యాన్‌లో ముగ్గురు శుభం సాబ్లె, అమర్‌సింగ్, సోమనాథ్ ఉన్నారు. పోలీసులను చూసి వారు పరారయ్యారు. వీరు మహారాష్ట్రలోని బుల్దాన, జల్గాన్ జిల్లాలకు చెందిన వారు. ప్రత్యేక పోలీసు బృందం వారిని అక్కడ అరెస్టు చేశారు. వీరితో పాటు వ్యాపారి గోతిరాం గురుదయాళ్‌సాబ్లెను కూడా అరెస్టు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ మొత్తంలో మొదటిసారి గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారులైన ఒడిశాకు చెందిన అశీష్, పండిత్, సోనూ అన్సారీ, అన్షుజైన్, మరి కొంత మందిని పట్టుకునే వరకు ప్రత్యేక బృందం కార్యాచరణ కొనసాగిస్తుందన్నారు. ఈ కేసులో కృషి చేసిన జైనథ్, ఆదిలాబాద్ గ్రామీణ సీఐలు సాయినాథ్, ఫణిదర్‌తో పాటు గ్రామీణ ఎస్ఐ ముజాహిద్, సిబ్బంది రుక్మారెడ్డి, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది, తదితరులను జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించినట్లు పేర్కొన్నారు.

జాలి కాదు.. దారి చూపండి!

- గ్రామీణుల ని'వేదన'..



☛ఈయన పేరు టేకం లక్ష్మణ్(22). ఉట్నూరు మండలం బొప్పరికుంట గ్రామం. రెండు నెలల కిందట ఉట్నూరు నుంచి గ్రామానికి వెళ్తుండగా రహదారికి అడ్డంగా ఉన్న వాగులో గల్లంతై మృత్యువాతపడ్డాడు. ఏటా వాగులు దాటుతూ ప్రాణాలు కోల్పోతున్నా.. వాగులపై వంతెనలు నిర్మించడం, రహదారులను బాగు చేయడం మాత్రం కరవైంది.



☛కొన్నేళ్ల కిందట వంకతుమ్మ(ఏ) గ్రామానికి చెందిన కొడప ఎత్మాబాయికి పురిటినొప్పులు రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్దామంటే గ్రామం నుంచి వెళ్లే మార్గంలోని వాగుపొంగి ప్రవహించింది. గ్రామస్థులు ఎన్ని ప్రయత్నాలు చేసినా సఫలం కాలేదు. ఎత్మాబాయి మృతి చెందిందని ఆమె తల్లి సాక్రుబాయి బోరుమంది.



గోరియగూడ, పరందోలి, మహరాజ్‌గూడ గ్రామాలకు వెళ్లాలంటే ఈ వాగు కష్టాలు తప్పవు

☛ కుమురం భీం జిల్లా కెరమెరి మండలం లక్మాపూర్, గోరియగూడ, పరందోలి, మహరాజ్‌గూడ, మకద్దంపూర్, కొలాంగూడ గ్రామాల్లో 1500 మందికి పైగా నివసిస్తున్నారు. ఈ గ్రామాలకు వెళ్లే మార్గమధ్యలో లక్మాపూర్, గోరియాగూడ వాగులు ప్రవహిస్తున్నాయి.

న్యూస్‌టుడే, ఉట్నూరు



ప్రమాదకరంగా మారిన వాగును పరిశీలిస్తున్న ఎస్ఐ మనోహర్, పోలీసుల బృందం

భారీ వర్షాలు కురవగానే.. వాగులు పొంగి అనేక గ్రామాలలో రహదారులు ముంపునకు గురవుతున్నాయి. గ్రామస్థులకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగి వాగులు దాటే క్రమంలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదకరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సమస్యను చూసి ప్రజాప్రతినిధులు, అధికారులు జాలి చూపడం తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదనే విమర్శలొస్తున్నాయి.

వర్షాకాలం వచ్చిందంటే గిరిజన ప్రాంతాల్లో వాగులు పొంగి ప్రవహిస్తూ.. రాకపోకలు నిలిచిపోతున్నాయి. గూడేలు, తండాలలోని గర్భిణులు ప్రసవ వేదన, అనారోగ్యం, అత్యవసర పరిస్థితి ఏదైనా సాహసం చేయాల్సిందే. అన్ని సందర్భాల్లో ప్రాణాలు దక్కుతాయనే ఆశలేదు. వాగుల కారణంగా అనేక గిరిజన గ్రామాలకు '108' వంటి అత్యవసర వాహనాలు వెళ్లలేకపోతున్నాయి. విషజ్వరాలు, ప్రసవ వేదనతో సకాలంలో ఆసుపత్రికి చేరలేక మృత్యువాత పడుతున్నారు. వాగులపై వంతెనలను నిర్మిస్తేగానీ ప్రాణాలకు భరోసా ఉండదు.

☛ ఇంద్రవెల్లి మండలం మామిడిగూడ, దుబ్బాగూడ గ్రామాలకు వెళ్లే మార్గమధ్యలో వడ్‌గావ్, ముత్నూర్ వాగులు వస్తాయి. వానాకాలంలో వాగులు పొంగి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. వీటితో పాటు గోపాల్‌పూర్, కన్నాపూర్‌తండ, జైత్రంతండా, డొంగర్‌గావ్‌లలో రేషన్ బియ్యం కూడా తెచ్చుకోలేని పరిస్థితి.

అనుమతుల పేరిట..



నర్సాపూర్(జే) గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో వాగు


ఉట్నూరు నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉండే వంకతుమ్మ(ఏ), వంకతుమ్మ(బి) గ్రామాలకు వెళ్లడానికి కనీసం రోడ్డులేదు. గతంలో ఉపాధి హామీ పథకంలో తాత్కాలికంగా మొరం రోడ్డు వేశారు. వర్షానికి అది కొట్టుకుపోయింది. మార్గమధ్యలో రెండు వాగులు ప్రవహిస్తున్నాయి.

రెండు గ్రామాల్లో 700 జనాభా ఉంటుంది. 108, 104 వెళ్లలేని పరిస్థితి. ఇలా వైద్యం అందక ఈ గ్రామాలలో చాలా మంది మృత్యువాతపడ్డారు. వంకతుమ్మ(ఏ) గ్రామానికి, నర్సాపూర్(జే) గ్రామాలకు ఈ సమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం బీటీ రహదారిని మంజూరు చేసినా అనుమతుల పేరిట పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు.

రేపు ఉమ్మడి జిల్లా ఖోఖో ఎంపిక పోటీలు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామంలోని లిటిల్ స్కాలర్స్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉమ్మడి జిల్లా ఖోఖో బాలబాలికల జూనియర్స్ విభాగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగ్రత్ ఈశ్వర్, ఎన్.శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఆసక్తిఉన్న క్రీడాకారులు ఉదయం 10 గంటలకు తమ ఆధార్, బోనఫైడ్ ధ్రువపత్రం, పదో తరగతి మెమోతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సురేశ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాకేశ్‌కు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఈ నెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. 22.11.2006 తర్వాత జన్మించిన వారై ఉండాలని, వివరాల కోసం చరవాణి 93984 30685లో సంప్రదించాలని వివరించారు.

కుంటాల ఏఓగా విక్రమ్



కుంటాల, న్యూస్‌టుడే: కుంటాల వ్యవసాయాధికారిగా దిలారి విక్రమ్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఉద్యోగ విధుల్లో ఇటీవల నూతనంగా చేరారు. ఇప్పటి వరకు భైంసా అర్బన్ ఏఓ ఆసం రవి అదనపు బాధ్యతలు చేపట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 83418 12400
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం

? మండలంలోని శివాపూర్ ఆంజనేయస్వామి దేవాలయ కాలనీలో మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. - వర్షతి పింటన్న, స్థానికుడు

✔ రెండ్రోజుల్లో మురుగు కాలువల్లో పూడిక తీయించేలా చర్యలు తీసుకుంటా. - రమేష్, ఎంపీడీఓ, కాగజ్‌నగర్

న్యూస్‌టుడే, కాగజ్‌నగర్

? పట్టణంలోని టీచర్స్ కాలనీలో మురుగు కాలువలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇళ్లలోని మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. - సదానందం, టీచర్స్ కాలనీ, కాగజ్‌నగర్

✔ పురపాలిక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. నిధుల మంజూరు అనంతరం మురుగు కాలువల నిర్మాణాలు చేపడతాం. - పెద్దింటి క్రాంతి, పురపాలిక మేనేజర్, కాగజ్‌నగర్

న్యూస్‌టుడే, సిర్పూర్(టి)

? సిర్పూర్(టి)లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. ఇంట్లో దూరి సామాన్లు తీసుకుని వెళ్తున్నాయి. - వెంకటేష్, సిర్పూర్(టి)

✔ గతంలో కోతులను పట్టించి అడవిలో వదిలేశాం. ఉన్నతాధికారులతో తగిన చర్యలు తీసుకుంటాం. - తిరుపతి, పంచాయతీ కార్యదర్శి, సిర్పూర్(టి)

నాడు భవనం లేక.. నేడు తరగతి గదుల కొరత

న్యూస్‌టుడే, రెబ్బెన

పద్దెనిమిదేళ్లు భవనం లేక ఇబ్బందులు పడిన కళాశాల విద్యార్థులకు 2018లో కొత్త భవనం నిర్మించారు. ఇక సమస్యల నుంచి బయటపడ్డామని అనుకున్న విద్యార్థులకు మళ్లీ తరగతి గదుల కొరత వెంటాడుతూనే ఉంది. 2001లో ప్రారంభమైన రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాల 2018 వరకు రెబ్బెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షిఫ్టు పద్ధతిలో కొనసాగింది. 2018 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కొత్త భవనంలోకి మారింది. అయినా సరిపోయేటన్ని గదులు లేక ఒక్కో గదిలో రెండు తరగతులను బోధిస్తున్నారు. ల్యాబ్ సైతం అదే గదిలో నిర్వహిస్తున్నారు.

రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్ కోర్సులతోపాటు వృత్తి శిక్షణ కోర్సులు కొనసాగుతున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో 340, ద్వితీయ సంవత్సరంలో 415 మంది విద్యను అభ్యసిస్తున్నారు. జనరల్ కోర్సులు మూడు, ఒకేషనల్ కోర్సులు ఏడు ఉన్నాయి. పది గ్రూపులకు 20 గదులు ఉండాల్సి ఉండగా 9 గదులు మాత్రమే ఉన్నాయి. ఇంకా 11 గదుల అవసరం ఉంది. పది ల్యాబ్‌లకు ప్రత్యేక గదులు లేవు. మరో 21 గదులు నిర్మిస్తే తప్ప విద్యార్థుల సమస్య తీరే పరిస్థితి కనబడటం లేదు. గదుల కొరతతో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులను ఒకే గదిలో కూర్చుండ పెట్టి బోధిస్తున్నారు.


ఒకే గదిలో రెండు తరగతుల విద్యార్థులకు బోధన

ల్యాబ్‌లకు ప్రత్యేక గదులు లేకపోవడంతో ఆరుబయట లేదా తరగతి గదిలో నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ప్రిన్సిపల్ గదిలో సిబ్బంది, కార్యాలయ నిర్వహణ కొనసాగుతుంది. వరండాలో వేసిన గచ్చు పూర్తిగా పగిలిపోయి పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కళాశాల చుట్టూ ప్రహరీ లేక ఆవరణ అధ్వానంగా మారుతుంది. కళాశాల చుట్టూ పంట చేను ఉండటంతో పలుమార్లు తేళ్లు, పాములు తరగతి గదులలోకి వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.


వరండాలో పగిలిన గచ్చు

మరిన్ని గదులు నిర్మించాలి

ప్రస్తుతం 755 మంది విద్యార్థులున్నారు. తరగతి గదులు 9 మాత్రమే ఉన్నాయి. ల్యాబ్‌లకు గదులు లేవు. మరో 21 గదులను నిర్మిస్తే సమస్య తీరుతుంది. ప్రహరీ మంజూరు చేస్తే బాగుంటుంది.
- అతియా ఖానం, ప్రిన్సిపల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు

20న పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ హరిణి వనస్థలి జింకల పార్కు వద్ద ఈ నెల 20న నిర్వహించనున్న పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంఘం భవనంలో సంఘం సభ్యులతో కలిసి దీనికి సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. అఖిల భారత పద్మశాలి సంఘం, తెలంగాణ పద్మశాలి సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య, సభ్యులు లింగయ్య, దర్శయ్య, శ్రీకాంత్, రమేశ్, తిరుపతి, లక్ష్మీనారాయణ, చందు, వెంకన్న పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా సంఘం సభ్యులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి అదనపు కలెక్టర్ దీపక్ తివారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలవుతున్న పథకాలను బీమా కంపెనీలకు అప్పగించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనలు విరమించుకోవాలన్నారు. బోర్డు అడ్వయిజరీ కమిటీని నియమించి దాని ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. బోర్డు నిధులు దుబారా కాకుండా కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలన్నారు. ఇతర శాఖలకు మళ్లించిన నిధులు తిరిగి బోర్డుకు చెల్లించాలన్నారు. ప్రమాద మరణానికి రూ.పది లక్షలు, సహజ మరణానికి రూ.అయిదు లక్షలు, దహన సంస్కారాల ఖర్చు, ప్రసూతి, వివాహ కానులకు రూ.లక్ష చెల్లించాలని డిమాండ్ చేశారు. 2009లో నమోదు చేసుకున్న కార్మికులకార్డులు యుద్ధప్రాతిపదికన రెన్యువల్ చేయాలన్నారు. ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులను భవన నిర్మాణ కార్మికులకు అందించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, అధ్యక్షుడు రాజేందర్, సభ్యులు కృష్ణమాచారి, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ హన్మంతు

కౌటాల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను ఎంఈఓ హన్మంతు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పని మంచి పేరు తెచ్చుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

నిరుద్యోగ యువతకు ప్రోత్సాహం

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధితో పాటు పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత ప్రభుత్వ కొలువులు సాధించేందుకు సింగరేణి సంస్థ అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇటీవల ఉపాధ్యాయ పోస్టులు సాధించిన నలుగురు విద్యార్థులను జీఎం శాలువాతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో గోలేటిలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని నలుగురు యువకులు ఎస్జీటీ ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. సింగరేణి పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తిశిక్షణ కోర్సుల్లో శిక్షణ ఇస్తుందన్నారు. బెల్లంపల్లి ఏరియా ఇంజినీర్ భీమ్‌రావు జాడే, ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీహెచ్‌పీ ఎస్ఈ కోటయ్య, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.


ఉద్యోగం సాధించిన వారిని సన్మానిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, తదితరులు

పోరాట యోధులను స్మరించుకోవాలి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ఆదివాసీల ఆరాధ్య దైవం కుమురంభీం పుట్టిన స్థలం రౌతసంకెపల్లిలో ఈ నెల 22న భీం, ఆయన అనుచరుడు ఎడ్ల కొండు వర్ధంతిని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం తన నివాసం వద్ద వేడుకలు నిర్వహించే కమిటీ సభ్యులు, ఆదివాసీ సంఘాలతో కలిసి సంబంధిత గోడప్రతులు ఆవిష్కరించారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన యోధులను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారీ సంఖ్యలో ఆదివాసీలు, ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. మాజీ సర్పంచులు మర్సుకోల సరస్వతి, కిష్టయ్య, శ్రీనివాస్, ఆదివాసీ సంఘాల సభ్యులు ఆత్రం రాజు, పెందోర్ సుధాకర్, సిడాం అర్జున్, మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి ఒకరి ఆత్మహత్య

వాంకిడి, న్యూస్‌టుడే: వాంకిడి మండలం కమాన గ్రామానికి చెందిన మస్నే రావుజీ(45) మద్యానికి బానిసై పురుగుమందు తాగి శుక్రవారం మృతి చెందినట్లు ఏఎస్సై పోశెట్టి తెలిపారు. రావుజీ కొంతకాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగడానికి డబ్బులు లేకపోవడంతో ఇంటిలోని చిన్న చిన్న వస్తువులు అమ్మి వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి తాగిన మైకంలో ఇంటి బయట కొట్టంలోని పత్తి పంటకు వాడే పురుగు మందు తాగి వాంతులు చేసుకుంటుండగా ఆయన చిన్న కుమార్తె చూసింది. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా అపస్మారక స్థితిలోని అతడిని ఆసుపత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పోశెట్టి పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం : కేసు నమోదు

రెబ్బెన, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 39 ఏళ్ల మహిళ ఈ నెల 12న అదృశ్యమైందని ఎస్సై చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ నెల 12న ఇంటి నుంచి మధ్యాహ్నం మంచిర్యాల జిల్లా ఐబీ తాండూరులో నిర్వహించే సంతకు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదన్నారు. బంధువుల ఇళ్లల్లో ఆరా తీసినా ఆచూకీ లభించలేదన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మిల్లుకు తిరిగి వెళ్లిన అసోసియేషన్‌కు చెందిన పేపరు లోడ్ లారీలు

కాగజ్‌నగర్‌గ్రామీణం, న్యూస్‌టుడే: సిర్పూరు పేపరు మిల్లు వివాదంలో హైకోర్టు ఉత్తర్వులతో మిల్లుకు కొంత అనుకూల వాతావరణం నెలకొంది. లారీల కిరాయి పెంచాలనే డిమాండ్‌తో గత నెల 26న మిల్లు నుంచి లారీ అసోసియేషన్‌కు చెందిన 33 లారీలను కాగితం లోడ్‌తో తీసుకువచ్చి స్థానిక లారీ అసోసియేషన్ కార్యాలయం ఎదుట నిలిపివేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఉత్తర్వులతో శుక్రవారం లారీ అసోసియేషన్‌కు చెందిన ఆ లారీలను మిల్లుకు తీసుకు వెళ్లారు. ఆ లారీల్లోని సుమారు రూ.5 కోట్ల విలువ చేసే కాగితాన్ని మిల్లులో దింపి యాజమాన్యానికి అప్పగించారు. 22 రోజులు స్థానిక లారీ అసోసియేషన్‌కు చెందిన పేపరులోడ్ లారీలు నిలిచిపోవడంతో లారీల యజమానులకు నష్టం వాటిల్లింది. పేపరులోడ్‌తో రోజుల తరబడి ఎటూ కదలకుండా ఉండటంతో లారీల టైర్లు దెబ్బతిన్నాయని యజమానులు పేర్కొంటున్నారు. ఇదే క్రమంలో వివిధ ప్రాంతాల వ్యాపార సంస్థలకు కాగితం పంపించాల్సి ఉండగా లారీల కిరాయిల విషయంలో మిల్లుకు, లారీ అసోసియేషన్లకు మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో ఎస్పీఎంకు కూడా తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లింది.


సిర్పూరు పేపరు మిల్లు

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కెరమెరి: మండల కేంద్రంలోని విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరాఫరాలో అంతరాయం ఉంటుందని ఎఈ శ్రీనివాస్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైద్య శిబిరం ఏర్పాటు

కెరమెరి, న్యూస్‌టుడే : మండలంలోని దేవుడ్‌పల్లి, ఇందాపూర్, నిశాని గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. వ్యాధులబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య విస్తరణ అధికారులు రవిదాస్, శ్యాంలాల్, సిబ్బంది వసంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


దేవుడ్‌పల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

అడవి పందుల బీభత్సం

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: పంట చేతికి వచ్చే సమయంలో అడవి పందులు ధ్వంసం చేస్తున్నాయి. శుక్రవారం ఉదయం ఎల్లూర్ గ్రామ పంచాయతీ పరిధి కొత్తగూడ శివారులోని తమ వరి పంటను అడవి పందులు ధ్వంసం చేశాయని బాధిత రైతు పాగిడె కిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఇలాగే పంట చేతికొచ్చే సమయంలో పంటను ధ్వంసం చేశాయని, అటవీ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. నష్టపరిహారం అందించాలని కోరారు.

గుణాత్మక విద్య అందిస్తే గుర్తింపు

బెజ్జూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు గుణాత్మక విద్య అందిస్తే ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు ఉంటుందని ఎంఈఓ సునీత తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. తరగతి గదిలో అనుసరించాల్సిన బోధన పద్ధతులను తయారు చేసుకుని ప్రదర్శనగా ఉంచాలన్నారు. అంకితభావంతో పని చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో సమయపాలన పాటించాలన్నారు. రిసోర్స్‌పర్సన్ జ్ఞానేశ్వర్, సీఆర్పీలు సత్యనారాయణ, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈఓ సునీత

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి పీఆర్టీయూటీఎస్ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వసుంధర డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. 1 నవంబరు 2018 నుంచి 1 నవంబరు 2024 మధ్యలో మూడు సంవత్సరాలు ఉన్నత పాఠశాల సర్వీస్ కలిగిన ఉపాధ్యాయులు ఓటు హక్కుకు అర్హత కలిగి ఉంటారని, నవంబరు 11లోపు తహసీల్దార్ కార్యాలయంలో ఓటు హక్కు నమోదు చేసుకోవాలని చెప్పారు. పీఆర్సీ, పెండింగ్ డీఏలు, గిరిజన సంక్షేమశాఖలో, సమగ్రశిక్షలో పని చేస్తున్న ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ కోసం, సీపీఎస్ రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాసరావు, మునార్కర్ అనీల్‌కుమార్, యూఎన్ చారీ, తంగడిపల్లి రాకేష్, జాడి దేవాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్టీయూటీఎస్ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి

ప్రైవేటు ఉద్యోగులకు సంరక్షణ చట్టం తేవాలి

రెబ్బెన, న్యూస్‌టుడే: ప్రైవేటు విద్యా సంస్థల్లో పని చేసే ఉద్యోగుల కోసం ప్రభుత్వం సంరక్షణ చట్టం తేవాలని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. శుక్రవారం రెబ్బెనలోని ప్రైవేటు పాఠశాలలతోపాటు ఇతర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. దేశం అభివృద్ధి చెందాలంటే అక్కడ చదువుకునే వ్యక్తుల సంఖ్య ఎక్కువగా ఉండాలన్నారు. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్‌ను విడతలవారీగా మంజూరు చేస్తే విద్యా వ్యవస్థ బాగుపడుతుందన్నారు. అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు లభించవని, ప్రైవేటు విద్యా సంస్థల్లో పని చేసే ఉద్యోగులకు ఆరోగ్య బీమా, హెల్త్‌కార్డు సౌకర్యం కల్పిస్తే ధీమాగా పని చేసుకుంటారన్నారు. ట్రస్మా అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపల్లి కిషన్‌రావు, జిల్లా అధ్యక్షుడు పీపీ దేవభూషణం, ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిచారి, కోశాధికారి బి.రాజేంద్రప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.


రెబ్బెనలో ప్రైవేటు ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాగదిరి శేఖర్‌రావు

క్యాంటీన్‌లో పాత పద్ధతిలో భోజనం సదుపాయం

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: బెల్లంపల్లి ఏరియా ఖైరిగూర ఓపెన్ కాస్టులోని క్యాంటీన్‌లో పాత పద్ధతిలో భోజన సదుపాయం కల్పించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్యా మొగిళి, ఖైరిగూర ఓసీపీ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఖైరిగూర ఓసీపీ ఆక్టింగ్ మేనేజర్ నారాయణతో పెండింగ్ సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. పాత పద్ధతిలో భోజన సదుపాయం కల్పించాలన్నారు. కార్మికుల పర్సనల్ రికార్డ్సులో కుటుంబాల ఫొటోలు అప్‌డేట్ చేయగా కొన్ని మారాయని వెంటనే సరి చేయాలని పేర్కొన్నారు. ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషశయనరావు, రాజేష్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, ఆనంద్, దివాకర్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు బయ్యా మొగిళి, పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఓదెలు, వెంకటేష్, పుట్ట అంజయ్య పాల్గొన్నారు.

కల్వర్టు లేక.. నాలుగు గ్రామాల అవస్థ!


ఇబ్బందులు పడుతూ వాగు దాటుతున్న ద్విచక్ర వాహనదారుడు

తిర్యాణి, న్యూస్‌టుడే : మండలంలో మంగీ గ్రామ పంచాయతీ తాళ్లపేట వాగుపై కల్వర్టు నిర్మించాలని తాళ్లపేట, గుట్టగూడ, అలిగూడ, పిట్టగూడ గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. ఈ తండావాసులు నిత్యావసర సరకుల కోసం మంగీ గ్రామానికి, వివిధ పనులకు మండల కేంద్రానికి వెళ్లాలంటే వాగు దాటాల్సిందే. కొద్దిపాటి వర్షం కురిసినా వాగు పొంగుతుండటంతో.. రాకపోకలు నిలిచిపోతుంటాయి. మంగీ హాస్టల్‌గూడతో పాటు ఈ గ్రామాల రైతుల పంట పొలాలు సైతం వాగు అవతల ఉండటంతో నిత్యం పనులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎడ్లబండ్లు సైతం వాగులో దిగబడిపోతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి వాగుపై కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.

★ ఈ విషయంపై మంగీ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌ని సంప్రదించగా.. అధికారులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

గ్రూప్-2, 3 పరీక్షలకు 18 కేంద్రాలు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో గ్రూప్-2, 3 పరీక్షల కోసం 18 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం నుంచి ఛైర్మన్ మహేందర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీలతో గ్రూప్-2, 3 పరీక్షలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు ఎస్పీ పి.ప్రభాకర్‌రావు, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 4,500 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. వీరి కోసం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లలో తొమ్మిదేసి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. తాగు నీరు, విద్యుత్తు, ఫ్యాన్లు, డ్యూయల్ డెస్క్ బెంచీలు తదితర వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు నోడల్ అధికారులుగా అదనపు కలెక్టర్, అదనపు ఎస్పీలు వ్యవహరిస్తారని చెప్పారు. ప్రశ్నాపత్రాల భద్రతకు కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నవంబరు 17, 18 తేదీల్లో గ్రూప్-3, డిసెంబరు 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు ఉంటాయన్నారు. అనంతరం స్ట్రాంగ్‌రూంను పరిశీలించారు. పరీక్షల ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీనర్సింహం, అదనపు సమన్వయకర్త రాజేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు ఎస్పీ పి.ప్రభాకర్

గుజరాత్ తరహాలో పత్తికి ధర కల్పించాలి

జైనథ్, న్యూస్‌టుడే : గుజరాత్ తరహాలో ఆదిలాబాద్‌లో పత్తికి ధర కల్పించాలని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్‌లో పత్తికి ధర తక్కువ కల్పించడంపై స్థానిక భాజపా, ఎమ్మెల్యే, ఎంపీలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 24న రాంలీలా మైదానంలో నిర్వహించనున్న సభకు కేటీఆర్ హాజరవుతున్నారన్నారు. సభను విజయవంతం చేసేందుకు మండలంలోని సాత్నాల వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.


ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటం ఉద్ధృతం చేస్తామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం జిల్లాకు చేరుకుంది. అంబేడ్కర్ భవన్‌లో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ షెడ్యూల్డ్ కులాలను ఒకచోట చేర్చి ఐక్యంగా ఉండాలని కోరుకుంటే మందకృష్ణ మాదిగ ఎస్సీలు విడిపోయేందుకు పోరాడటం సమంజసం కాదన్నారు.

కోత దశకు చేరే..

37 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

జిల్లాలోని చెరువులు, ప్రాజెక్టులు, బోరు బావుల కింద ఈ వానాకాలం పంట సీజన్‌లో 18.34 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఈ సారి ముందుగా వర్షాలు కురిశాయి. పొలాల్లో ఆగస్టులోపే రైతులు వరి నాట్లు పూర్తి చేసుకున్నారు. ఈ సీజన్ సాగు కొంత ముందుగా పూర్తి కావడంతో పంట ఇప్పుడిప్పుడే కోత దశకు చేరింది. గత సంవత్సరం వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో కొంత జాప్యం జరగడంతో రైతులు పండించిన ధాన్యాన్ని కల్లాల్లోనే రోజుల తరబడి నిల్వ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్య పునరావృతం కావొద్దనే ఆలోచనతో ముందుగా వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నారు.


ఈజ్‌గాం ఆయకట్టులో చేతికి అందే దశలో వరిపంట

కాగజ్‌నగర్‌గ్రామీణం, న్యూస్‌టుడే:

జిల్లాలోని 15 మండలాల్లో 37 వరిధాన్యం కొనుగోలు ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో ఏర్పాటు చేయనున్న 31 వరిధాన్యం కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు, 6 కేంద్రాలను ఐకేపీకి కేటాయించనున్నారు. ఐకేపీకి దహెగాంలో 3, పెంచికల్‌పేట, కౌటాల, సిర్పూర్(టి) మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున వరిధాన్యం కేంద్రాలను నిర్వహణ బాధ్యతలను అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ కేంద్రాల ఏర్పాటుతో వరిధాన్యం స్థానికంగా మార్కెట్ సౌకర్యం, గిట్టుబాటు ధర పొందేందుకు రైతులకు సౌలభ్యం కానుంది. తేమశాతం 17లోపు ఉన్న ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2320, సాధారణ ధాన్యానికి క్వింటాకు రూ.2300 చొప్పున కొనుగోలుకు ధర నిర్ణయించారు..

తేమ, పొల్లుపై అవగాహన

వరిధాన్యంలో పొల్లు, తేమశాతంపై అవగాహన లేక గత సంవత్సరం కొన్ని కేంద్రాల వద్దకు తీసుకు వచ్చి రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ కేంద్రాల ప్రారంభానికి ముందే రైతులకు అవగాహన కల్పించాలి. రైసు మిల్లుల ముందుగానే కేటాయింపు చేయాలి. గత సంవత్సరం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన తర్వాత రైసుమిల్లుకు తరలింపులో కొంత జాప్యం జరిగింది. కేంద్రాల వద్ద టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి.

కొనుగోళ్లలో ఇబ్బందులు రానివ్వం

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూస్తాం. రైతులకు అందుబాటులో టార్పాలిన్లు కొన్నింటిని కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. కొనుగోలు కేంద్రాల నిర్వహణపై ఎప్పటికప్పుడు మానిటరింగ్ ఉంటుంది.
- శ్రీనివాస్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి